ఓ మూల స్తబ్దంగా నిలబడివున్న తల్లిని కలుసుకునేదాకా స్థిమితంగా వుండలేకపోయాడు. రాచరిక వ్యవస్థలోని రాజసం బ్రతులకే కాదు  చావులకూ సమాధుల రూపంలో విస్తరిస్తుందన్న సత్యానికి సంకేతంలా నిలిచిన ఆ ప్రదేశంలోని ఓ సమాధి సమీపంలో కూర్చున్న విశ్వ నిస్త్రాణంగా కృషి గురించి ఆలోచిస్తున్నాడు.  తన పౌరుషాన్ని సమాధి చేయడానికి డబ్బున్న ఓ అమ్మాయి యిలా ప్లే చేసింది మళ్ళీ.  ఆమె తాతయ్యకు తన తండ్రిని హత్య చేయడానికి ఏ డబ్బు, పరపతి సహకరించాయో యిప్పుడు అదే డబ్బుతో గెలుపనే గర్వం కోసం కృషి మరో సారి ఢీకొని మనసుని గాయపరిచింది.

అంచెలంచెలుగా ఆమె మనసుదాకా విస్తరించాలని అప్పటికి తోచిన ఓ మార్గంతో ఆమెతో పరిచయాన్ని పెంచుకున్నాడు. ఒకవేళ పరిచయం విడదీయలేనంత స్నేహం దాకా వెళితే దాన్ని తన శత్రుత్వానికి బారులా వాడుకునేవాడే కాని ఊహించలేని చాలా మలుపులు తిరిగిన స్నేహం యిప్పుడు ముఖాముఖీ పోరాటం వేపు మళ్ళింది.

“అమ్మని ఆశ్రమానికి తీసుకువెళ్ళు”

సూరికి తల్లిని అప్పచెప్పిన విశ్వ ఓ పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి కృషికి ఫోన్‌చేశాడు.

“కంగ్రాట్స్ కృషి”

“థాంక్స్” కృషి నవ్వు వినిపించింది.

“పాపం నీకు పెట్టుబడి పెట్టిన చౌదరి మరో అయిదు లక్షలు నష్టపోయాడేమో కదూ. అయినా వున్నట్టుండి అలా బ్లేంక్ అయిపోయి ఒక్క ప్రశ్నకీ జవాబు చెప్పలేక పోయావేం- ”

“చేయాల్సింది చేసి యింకా సానుభూతి ప్రకటిస్తున్నావా కృషి”

“నువ్వేం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడం లేదు”

ఇదీ నటనే అనుకున్న విశ్వ గొంతులో కోపాన్ని అదిమిపెడుతూ అడిగాడు .  “ఒకవేళ నువ్వోడితే ఈ పాటికి శోభనానికి సిద్ధపడేదానివేమో కదూ”

నిశ్శబ్దంగా వుండిపోయింది.

“ఇష్టం లేనివాడితో ఓ రాత్రి గడపాలి అంటే నీ లాంటి ఆడపిల్ల ఎలా రియాక్టవుతుంది కృషి ”

“తన మీద తనకే జుగుప్సతో జీవితమంతా కుమిలిపోతుంది”

“ఇప్పుడు నీ మీద నీకు అలాంటి జుగుప్స కలిగించబోతున్నాను”

“కలగంటున్నావా”

“లేదు కృషీ!  నేను అనుకున్నది నిజం చేయబోతున్నాను. . . శారీరకంగా నాతో కలిసే పరిస్థితే వస్తే ఓ జీవితకాలం నువ్వెంత బాధకు గురవుతావో అనుభవించకుండానే నిన్నలాంటి స్థితికి నెడితే. . .”

“ఎలా” వ్యంగ్యంగా అడిగింది.

“వెయిట్ అండ్ సీ”

ఫోన్ క్రెడిల్ చేశాడు విశ్శు. తనకి సాయం చేసిన రామనాథ చౌదరిని గుర్తుచేసుకుంటూ......

0 0 0 0

"విశ్శు గెలుపు కోసం అయిదు లక్షలు పెట్టుబడి పెట్టిన మీరు మళ్ళీ అతడు ఓడిపోవడానికి వాళ్ళమ్మని ఎందుకు కిడ్నాప్ చేయించారో నాకు తోచడం లేదు చౌదరిగారూ" ఆశ్చర్యంగా అడిగాడు రంగధాం స్థిమితంగా మందుకొడుతున్న చౌదరిని చూస్తూ.

భావరహితంగా చూశాడు ఆయన. దోషి నుంచి నిజం రాబట్టడానికి చాలా శ్రమించి చివరికి తన తప్పుని దోషి ఒప్పుకున్నాక నువ్వు దోషివే కాదు అని తేల్చి చెప్పిన దొంగ పోలీసాఫీసరులా నవ్వాడు.

అబద్ధపు సాక్ష్యాలతో ఆఖరిదాకా పోరాడి, అనుకూలంగా జడ్జిమెంటు వచ్చే సమయంలో 'నేను కోర్టులో యింతకాలం ప్రజెంట్ చేసింది దొంగ సాక్ష్యాలే' అని జడ్జిముందు ఒప్పుకున్న లాయరులా మొహాన్ని సీరియస్‌గా పెట్టాడు చౌదరి. "ఒకవేళ విశ్శు గెలిస్తే నాకొరిగేదేమిటి"

వెంటనే జవాబు చెప్పలేకపోయాడు రంగధాం.

"ఫలానా లాభముందీ అని ఉత్సాహంగా చెప్పలేకపోయారూ అంటే విశ్శు గెలుపులో ఖచ్చితంగా మనకి లాభం లేదనేగా. మహా ఐతే ఓ రాత్రంతా కృషిని అనుభవిస్తాడు విశ్శు. అంతేగా . . .దాని వలన మనకి ఒరిగేదేమిటి? మనకి ఏదీ జరగదు సరికదా ఒకవేళ వాడితో అనుభవం దానికి నచ్చినా, దానితో అనుభవం విశ్శుకి సంతృప్తి నిచ్చినా, అపార్థాలు చెరిపేసుకొని హాయిగా కాపరానికి సిద్ధపడే ప్రమాదం వుంది. కాని అలా జరక్కూడదు. శీలం పోగొట్టుకోటానికి ఇష్టపడని కృషి మరో మారు ఇలాంటి ఘాతుకానికి సిద్ధపడిందని కృషిని విశ్శు ద్వేషిస్తూ వుండాలి. అందుకే విశ్శు తల్లిని నేనే కిడ్నాప్ చేయించాను."

"కాని మీరు అయిదు లక్షలు కోల్పోయారుగా."

"కృషి మూలంగా కోట్ల రూపాయలు ఇప్పటికే నష్టపోయినవాడ్ని రంగధాం- ఈ నష్టమెంతని! కాని ఇప్పుడో . . . ఐదు లక్షల్ని అడ్డం పెట్టుకుని విశ్శుని దాని మీదికి ఆయుధంలా ప్రయోగించబోతున్నాను. రెచ్చిపోయి వున్న విశ్శు ఆధారంతో కృషి మీద శాశ్వతంగా గెలవబోతున్నాను. . . "

ఎలాగో చెప్పలేదు. ఇంతలో తెలిసింది విశ్శు వచ్చాడని. . .లోనికి రప్పించాడు.

విశ్శుని చూస్తూనే "మీ మీద చాలా నమ్మకంతో పెట్టుబడిపెట్టాను" అంటూ తన బాధని వ్యక్తం చెయ్యబోయాడు కాని దానికి ముందే ఏ స్థితిలో తను ఓడాల్సి వచ్చిందీ చెప్పేశాడు విశ్శు . . . అంతే కాదు - పోయిన ఐదు లక్షల విషయంలో తన బాధని ప్రకటించాడు.

"ఇక్కడ నేను ఆలోచిస్తున్నది పోయిన డబ్బు గురించి కాదు విశ్శు - ఓ ఆడపిల్ల తెగువ గురించి. . .ఏం చూసుకుని దానికంతపొగరు - డబ్బునా . . అది నా దగ్గరా వుందే. .

తిరుగుబాటు చేసి నన్నో సంఘ విద్రోహక శక్తినంది. . . నేను సరే. . . మరి నీ తెలివీ ఎందుకూ కాకుండ పోయిందే" గాయపడి వున్న ఓ మనిషి అహాన్ని ఎంత చాతుర్యంగా దెబ్బ తీయొచ్చో తెలిసిన చౌదరి అద్భుతంగా అవకాశాన్ని వినియోగించుకున్నాడు.

మరింత సునిశితంగా మెదడు పొరల్లోకి చొచ్చుకుపోయేట్లు మాట్లాడేడు. "హత్య రాజకీయాలతో పబ్బం గడుపుకునే ఉపాధ్యాయ ఒకనాడు నీ తండ్రిని హత్య చేయించాడు. . . అతడికి వారసురాలైన కృషి తన మాట నెగ్గాలని ఈ రోజు నీ తల్లినీ హత్య చేస్తానని సవాల్ చేసింది. ఒక్క ఉపాధ్యాయే అనుకుంటే యిప్పుడు ఆజ్యంలా అతడికి కృషి కూడా తోడైంది విశ్వ . . ."

"ఇక నాకు విడిచి పెట్టండి" సాలోచనగా అన్నాడు విశ్వ. ఆ క్షణంలో విశ్వ మానసిక స్థితి చౌదరి వూహించి వుండడు. . . ఉపాధ్యాయని దెబ్బ తీయడానికి కృషి పరిచయాన్ని కోరుతున్న విశ్వకి యిప్పుడు కృషి కూడా ప్రమాదకరమైందే అని స్పష్టంగా బోధపడడంతో ఆఖరి అధ్యాయపు పుటల్ని రాయబోతున్నట్టుగా అన్నాడు.

"కృషికి వున్నది ఉపాధ్యాయ అండే అయితే అతడి అండని కృషి త్వరలోనే కోల్పోతుంది. ఉపాధ్యాయకి అండ కృషే అయితే కృషి ఆసరాని ఉపాధ్యాయ త్వరలోనే కోల్పోతాడు."

"ఎలా" ఉత్కంఠగా చూశాడు చౌదరి.

చెప్పలేదు వివరంగా - ఇక చెప్పడం తన అభిమతంకాదు. చేసి చూపించాలనే తిరుగులేని సంకల్పాన్ని ప్రకటిస్తూ రెండు నిముషాల నిశ్శబ్దం తర్వాత చెప్పాడు విశ్వ - "మూడు నెలల గడువులో కృషి ఈ దేశం విడిచి వెళ్ళిపోతుంది. వెళ్లడం యిష్టం లేకపోతే అవమాన భారంతో ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటుంది"

ఏ ఆలోచనల ఒరిపిడిలో విశ్వ అలా మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు. కాని విశ్వ కళ్ళలో ఎరుపు జీరలు, అతడి గొంతులు పలికిన ఆత్మ విశ్వాసం చౌదర్ని అద్భుతంగా కదిలించాయి. యుద్దంలో అడుగుపెట్టే వరకే ప్రేరణ అందించాల్సింది. ఆ తర్వాత యుద్ధమే ప్రేరణ అందిస్తుంది. అసలు విశ్వ గెలిచినా గెలవకపోయినా కనీసం కృషిని ఆందోళన పర్చగలడు - ఏకాగ్రత లోపించే స్థితికి ఆమెను నెట్టితే చాలు మిగతాది తాను చూసుకుంటాడు.

పద్మవ్యూహంలో అడుగు పెట్టిన అభిమన్యుడు గెలవకపోతేనేం - కౌరవుల్ని చాల కంగారు పెట్టేశాడు.

కృషి మూలంగా కోట్ల నష్టానికి గురైనా ఇప్పుడు అయిదు లక్షల పెట్టుబడితో ఓ ఆయుధంలా ముందుకు దూసుకుపోతానంటున్న విశ్వని చౌదరి చూస్తుండగానే వెళ్ళిపోయాడు విశ్వ.

చాలా బలమైన పావుని కదిలించాడు మరి-

“మన కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు ప్రకటించి ఏడాది కాక ముందే సుమారు బిలియను డాలర్ల మేరకు పెట్టుబడి పెట్టడానికి విదేశీ ఇన్వెస్టర్లు నుంచి హామీ లభించింది. ఇదిలా వుండగా మన దేశంలోని అమెరికన్ ఎలక్ట్రానిక్ కంపెనీ “మీటరులా” ఇక్కడ నుంచి తన పరిశ్రమల్ని చైనాకి తరలించటానికి సిద్ధపడుతూంది.”

క్షణం ఆగాడు వేదికపై మాట్లాడుతున్న విశ్వ-

నేషనల్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆర్గనైజ్ చేస్తున్న సెమినార్ అది - ఆ సెమినార్‌కి చాలా మంది పారిశ్రామిక వేత్తలతో బాటు ఉపాధ్యాయ కూడా వచ్చారు. ప్రస్తుతం ఆయన వేదికపై అధ్యక్ష స్థానంలో కూర్చుని వున్నారు. పాతికేళ్ళు నిండని ఓ అబ్బాయి అద్భుతమైన అనాలిసిస్‌తో విదేశీ పెట్టుబడుల గురించి మాట్లాడుతుంటే ఆసక్తిగా ముందుకు వంగి టేబుల్‌పై చేతులానించి వింటున్నారాయన.

“ఇలా మన దేశంలో పెట్టుబడి పెడతామన్న విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి మరో దేశానికి తమ పరిశ్రమల్ని తరలించుకోవడానికి కారణం మన ప్రభుత్వ యంత్రాంగాల్లో పనుల నిర్వహణలో జరుగుతున్న జాప్యం - ఆలోచనలు కాగితాలకే పరిమితం కావడం. 1990 లో థాయ్‌లాండ్‌కి 47 బిలియన్ డాలర్ల ప్రతిపాదనలు వస్తే మన దేశానికి కేవలం ఒక బిలియన్ డాలర్ల ప్రతిపాదనలతో ముగిసిపోవడం బాధాకరమైన విషయం”

ఓ నివేదికను తయారు చేసి అందులో సారాంశాన్ని ఉపన్యాసంలా చదువుతున్న విశ్వ కౌన్సిల్‌తో సంబంధం లేని వ్యక్తి అయినా ఇప్పుడా అవకాశన్ని దక్కించుకున్నది ప్రొడక్టివిటీ కౌన్సిల్‌లో అతడికి తెలిసిన ఓ స్నేహితుడి మూలంగా-

కేవలం ఉపాధ్యాయగారి సమక్షంలో తన మేధస్సుని ప్రదర్శించే ప్రయత్నంలో అవకాశమివ్వమని విశ్వ అడగలేదు. ప్రభుత్వంలో బ్యూరోక్రసీ వైఫల్యాల గురించి ఉపాధ్యాయ వంటి వ్యక్తుల దృష్టికి తీసుకు వెళ్ళడం తన అభిమతమన్నాడు. వేదికలోని స్టేటస్టిక్స్ విశ్వ స్నేహితుడ్ని కూడా ఆకట్టుకోవడంతో పైగా అప్పుడెప్పుడో బాంబే యూనివర్శిటీలో విశ్వతో వున్న పరిచయంతో సరే అని అంగీకరించి పది నిమిషాల సమయాన్ని కేటాయించాడు.

“ఎవరీ అబ్బాయి” అడిగాడు ఉపాధ్యాయ అతని పక్కనే కూర్చున్న కౌన్సిల్ సెక్రటరీని.

“పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో రిసెర్చి స్కాలర్ - ప్రస్తుతం నిరుద్యోగి. త్వరలో ఉద్యోగం కోసం స్టేట్స్‌కి వెళ్తున్నవాడు. పేరు విశ్వనాథ్ ” చెప్పాడు నెమ్మదిగా. ఇదేమీ గమనించడం లేదు విశ్వ.

“భారతదేశంలో వున్న విస్తృతమైన మార్కెట్ గురించే గాక నైపుణ్యతగల కార్మికులకే లోటూ లేదన్న విషయం అంతర్జాతీయ యిన్వెస్టర్లకి తెలుసు. అయితే ఇక్కడ సరైన ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం, ప్రాజెక్టుల అనుమతిలో అవరోధాలు వారికి తల నొప్పిగా తయారయ్యాయి. అదే తూర్పు ఐరోపా దేశాలలో టాక్స్ హాలిడేస్ మాత్రమే కాక ప్రాజక్టులకు అనుమతి పత్రం తేలిగ్గా లభిస్తుంది.”

విశ్వ అంచనా తప్పు కాలేదు.. . తను అనుకున్న దానికన్నా ఉపాధ్యాయ గార్ని అమితంగా ఆకట్టుకోగలిగాడనటానికి ఉదాహరణ ఆయన కనబరుస్తున్న ఆసక్తి. . . వయసుకి మించిన పరిజ్ఞానంతో భారత దేశ పారిశ్రామిక ప్రగతికి సంబంధించిన కీలకమైన విషయాల్ని చాలా సునాయాసంగా చర్చిస్తున్నాడు. డబ్బు పెట్టుబడి పెట్టడంలో ఎదురయ్యే సమస్యల గురించి సరైన అవగాహన లేకుండా సంఘర్షణకి లోనవడమే తప్ప ఎంతమంది పారిశ్రామిక వేత్తలకి తెలుసు యిలాంటి లోపాల గురించి?

"మన దేశంలో శ్రమ శక్తి తక్కువ రేటుకే లభిస్తుంది. అయితే ఉత్పాదకతను పెంచే కార్మిక చట్టాలు లేవు. . .కార్మిక సంఘాలకి ఉద్యోగ భద్రతలపై ఆసక్తి తప్ప ఉద్యోగుల బాధ్యత గురించి నచ్చచెప్పే ఆసక్తి లేదు."

పరిశ్రమలు నష్టాలలో కూరుకోవటానికి ముఖ్యమైన కారణాల్ని వ్యక్తం చేస్తున్న విశ్వనాథ్‌ని మరింత అభినందనగా చూశారు ఉపాధ్యాయ".

"అసలు ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ రిలేషన్స్ ముందుగా ఆలోచించాల్సింది విదేశీ పెట్టుబడులే కాక సవరించబడాల్సిన ఫ్యాక్టరీ ఏక్ట్స్ ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ చట్టాల గురించి-"

విశ్వ ఉపన్యాసం ఇంకా పూర్తి కాలేదు. ఉన్నట్టుండి ఆ స్టార్ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో కలకలం మొదలైంది. అదికాదు. . . ఓ విద్రోహుల చర్యలా ఆ హాల్లో దట్టంగా పొగ వ్యాపిస్తూంది.

"స్మోక్ బాంబ్స్" అన్న కేకలతో జనం కకావికలైపోయారు. . . ఎవరే పక్క పరుగెడుతున్నదీ అసలేం జరిగిందీ ఎవరికీ అర్థం కావడం లేదు. . . అర నిముషం వ్యవధిలో మేఘాల్లా ఆవరించిన పొగలో పైకి లేవబోయిన ఉపాధ్యాయకి ఏమీ కనిపించని ఆ స్థితిలో తననెవరో లాగుతున్నట్టు బోధపడింది. ఊపిరితిత్తులనిండా నిండిన పొగతో ఉక్కిరిబిక్కిరైపోయారు. తననెవరో కిడ్నాప్ చేయాలని ప్రయత్నిస్తున్నారని గ్రహించి శక్తిని కూడగట్టుకోబోయారు కాని అప్పటికే ఆయనకు స్పృహ తప్పుతూంది.

రాత్రి పది గంటల సమయంలో అక్కడ జరిగిన సంఘటన రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసుల్ని ఎంత కలవర పరిచిందీ అంటే నగరం అలర్ట్ చేయబడింది. అందరి నోటా ఒకటే మాట . . . టెర్రరిస్టులు ప్రముఖ పారిశ్రామికవేత్త ఉపాధ్యాయని కిడ్నాప్ చేయబోతే విశ్వ అనే యువకుడు ప్రాణాలకి తెగించి పోరాడాడు. ఉపాధ్యాయగార్ని రక్షిస్తూ తాను ధారుణంగా గాయపడ్డాడు.

పత్రికలు, ప్రజలు ఆసక్తిగా అపోలోకి చేరుకున్నారు. మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటలకల్లా. అప్పటికే స్పృహలోకి వచ్చిన ఉపాధ్యాయ జరిగింది తెలుసుకుని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వున్న విశ్వ దగ్గరికి వెళ్ళారు. అతడి షర్టు రక్తసిక్తమై వుంది. మోచేయితో బాటు భుజం కూడా చీరుకుపోవడంతో బేండేజ్ కట్టినట్టు చెప్పారు డాక్టరు.

తనదాకా వచ్చేసరికి ఆందోళన పడ్డారేమో ఆప్యాయంగా విశ్శు తల నిమురుతూ "థ్యాంక్స్" అన్నారు .

"బుద్ధిబలమే కాక భుజ బలమూ కలవాడినని నిరూపించుకున్నావు"

బడలికగా చూశాడు విశ్శు. "నేనొక్కడిని పోయినంత మాత్రాన ఈ దేశానికి జరిగే నష్టం ఏమీ లేదు. కొన్ని వేల మందికి ఉపాధి నివ్వగల మీలాంటి వారు క్షేమంగా వుండాలి."

ఉపాధ్యాయ మరింత ఉద్విగ్నతకు లోనయ్యాడు విశ్శు మాటలువింటూ - "నువ్వు విదేశాలలో స్థిరపడాల్సిన అగత్యం లేదు విశ్వనాథ్ నాకు బాడీ గార్డ్‌లా నా ఇంట్లో నాతోనే వుంటావు. నా ఫ్యాక్టరీస్‌కి సంబంధించిన వ్యవహారాల్ని చూస్తూంటావ్ - నీకు కావాల్సినంత జీతం యిస్తాను" ఓ ఆదేశంలా అన్నారాయన. ఓ కోటీశ్వరుడి దృష్టికి వెళ్ళిన వ్యక్తి జీవితంలో హఠాత్తుగా ఏర్పడే అసాధారణమై మార్పులెలా వుండేదీ యిప్పుడే తెలిసినట్టు అక్కడ సన్నివేశాన్ని చూసిన వ్యక్తులు ఆలోచిస్తుండగానే బయటికి నడిచారు ఉపాధ్యాయ.